## క్లుప్తంగా

### హుండీల ఆదాయం రూ.3.10 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, నవదుర్గ ఆలయ ఈఓ పి.శ్యామలరావు సమక్షంలో హుండీలను తెరిచారు. మొత్తం 134 రోజులకు రూ. 3,10,825 సమకూరాయని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ బి.వి. మాధవరావు తెలిపారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### గిరిజనులకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ



గిరిజన మహిళలకు దుస్తులు అందజేస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మండలంలోని చినమోసూరువలస, చిలకమ్మవలస గిరిజన గ్రామాల్లో ప్రజలకు బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో గురువారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు.అలాగే గర్భిణులకు నగదు అందజేశారు. సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ సైనికులు రెడ్డి రామకృష్ణ మోహనరావు, గోవిందరావు, మామిడి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

### వంద గంటల అఖండ నామసంకీర్తన



సత్యసాయి అఖండ నామసంకీర్తనలో భక్తులు

రాజాం: పట్టణంలోని బాబానగర్ శివం మందిరంలో భగవాన్ సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా వంద గంటల దివ్య అఖండ నామసంకీర్తన కార్యక్రమం భక్తులు నిర్వహిస్తున్నారు. గురువారం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సత్యసాయి నామ సంకీర్తన ప్రారంభించారు. ఈనెల 28 వరకు ఈకార్యక్రమం ఉంటుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వి.వి.ఎస్ సునీల్‌కుమార్ రాథో తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల స్టేట్ గ్రామ సేవా ఇన్‌చార్జ్ ఎం.సత్యనారాయణ, స్టేట్ వేదం కో–ఆర్డినేటర్ ఆర్.వి.జె.దుర్గాప్రసాద్, జిల్లా ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు, డాక్టర్ రఘుబాబు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

రాజాం సిటీ: విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టిసారించాలని స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు గురువారం బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేపట్టి తగు సూచనలు చేశారు. ఎక్కువగా ఒత్తిడికి గురికాకుండా లక్ష్యంపై దృష్టిసారించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, పి.సూర్యారావు, కళాశాల సిబ్బంది మండల చైతన్య, కొల్ల యశశ్, యు.శ్రీకాంత్, టి.శ్యామలరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న భాస్కరరావు

బొబ్బిలి: ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని స్థానిక భాస్కర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని కళాశాల వ్యవస్థాపకులు, వైఎస్సార్ సీపీ నాయకుడు తూముల భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మందులతో పాటు వినియోగ సమాచారాన్ని అందించడంలో ఫార్మాసిస్టుల పాత్రకీలకమైందని అన్నారు. ర్యాలీ వేణుగోపాలస్వామి ఆలయం వరకు సాగింది. ప్రిన్సిపాల్ కె.రాజేష్, అధ్యాపకులు రామకృష్ణ, సాయికుమార్, కృష్ణవేణి, అప్పలనాయుడు, తిరుపతినాయుడు, దామోదర్ పాల్గొన్నారు.

# నీరుగారుతున్నాయ్..!

- శిథిలావస్థకు చేరుతున్న వాటర్ ట్యాంకులు
- రామభద్రపురం మండలంలో ఓవర్ హెడ్ ట్యాంకుల సంఖ్య : 36
- గిరిజన గ్రామాల్లో సోలార్ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్యాంకులు: 22
- పది ఓవర్ హెడ్ ట్యాంకులకు లీకులు
- ప్లాస్టిక్ ట్యాంకులకు కాలం చెల్లినా మార్చని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాంకులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం



కొట్టక్కిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు



నేరళ్లవలస గిరిజన గ్రామంలో పాడైన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకును చూపిస్తున్న స్థానికుడు

రామభద్రపురం: మండలంలోని పలు మైదాన ప్రాంతాల ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే గిరిజన గ్రామాల్లో సోలార్ విద్యుత్ ఆధారిత బోర్ల వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులకు పగుళ్లు వచ్చి పాడవుతున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు ప్లాస్టిక్ ట్యాంకులు లీకవుతుండడంతో తాగునీరు వృథా అవుతోంది. మండలంలోని మైదాన ప్రాంత గ్రామాల్లో ఉన్న 36 ఓవర్ హెడ్ ట్యాంకుల్లో సుమారు పదింటిని 30 నుంచి 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈట్యాంకులు శిథిలావస్థకు చేరుకుని, బీటలు వారి నీరు కారుతున్నాయి. నీరు వృథా మాట పక్కనపెడితే ఈ ట్యాంకులు ఎప్పుడు కూలి పోయి, ఏ ప్రమాదం సంభవిస్తుందో అని వాటి సమీపంలో నివసిస్తున్న ప్రజలు భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. 22 గిరిజన గ్రామాల్లో సోలార్ విద్యుత్ ఆధారిత బోర్ల వద్ద ప్లాస్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేయగా దాదాపు అన్నింటికీ కాలం చెల్లింది. నేరళ్లవలస, ఎనుబరువు, కొండగుడ్డి వలస, తదితర గ్రామాల్లో ట్యాంకుల అడుగు భాగంలో పగుళ్లు ఏర్పడడడంతో ట్యాంకుల్లో నీరు నిలవడం లేదు. తరచూ మోటార్లు వేసి ట్యాంకులకు నీరు ఎక్కించాల్సి వస్తోంద ని, పాలకులు,అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకుంటున్న ఓవర్‌హెడ్ ట్యాంకుల స్థానంలో కొత్తవి నిర్మించాలని, అడుగు భాగాలు వదిలేసిన ప్లాస్టిక్ ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

#### పనులను రద్దు చేస్తూ జీఓ జారీ చేసిన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలోని వివిధ గ్రామాల్లో అదనపు ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటుకు జలజీవన్ మిషన్ (జేజేఎం) కింద 68 పనులకు రూ.13.88 కోట్లు మంజూరు చేసింది. అందులో గత ప్రభుత్వంలో ప్రారంభమైన చిన్న చిన్న పనుల్లో 48 పూర్తయ్యాయి. ట్యాంకుల నిర్మాణాలు వంటి పెద్ద పనులు ఉన్న గ్రామాలకు సంబంధించి ఎన్నికలకు ముందు టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో దాదాపు రూ.9.1కోట్ల విలువ చేసే సుమారు 20 పనులు ఉండిపోయాయి. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 918 జీఓ ద్వారా పాత పనులన్నీ రద్దు చేసింది. దీంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు జరగలేదు.



ఎనుబరువులో లీకులు ఏర్పడిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు

#### పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో సోలార్ విద్యుత్ బోరు వద్ద ఎన్నో ఏళ్ల క్రితం ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. అది పూర్తిగా పాడైంది. అడుగు భాగంలో పగుళ్లు రావడంతో నీరు కారిపోతోంది. నీటి ట్యాంకు ఉందన్న పేరే తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. పాలకులు,అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కొత్త ట్యాంకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– బోయిన బాలరాజు, నేరళ్లవలస గిరిజన గ్రామం

#### కొత్త ట్యాంకుల నిర్మాణానికి చర్యలు



గిరిజన గ్రామాల్లో సోలార్‌తో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకుల స్థానంలో 10 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకుం టున్నాం. ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించే వరకు తాత్కాలికంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో గిరిజన గ్రామాల్లో కొత్త ప్లాస్టిక్ ట్యాంకుల ఏర్పాటు అంశంపై సర్పంచ్‌లతో చర్చిస్తున్నాం. తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

– పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రామభద్రపురం మండలం

### సమాచార హక్కు చట్టంపై అవగాహన

తెర్లాం: రైతులతో పాటు, అన్ని వర్గాల ప్రజలు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ బొబ్బిలి సహాయ సంచాలకులు(ఏడీఏ) మధుసూదనరావు అన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై కుసుమూరు గ్రామ ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఏ సమాచారమైనా సమాచార హక్కు చట్టం ద్వారా అడిగి తెలుసుకునే హక్కు ప్రతీ పౌరుడికీ ఉందన్నారు. సమాచార హక్కు చట్టం అనేది అన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు వర్తిస్తుందని, పౌరులు అడిగే సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతీ అధికారిపై, సంబంధిత శాఖపై ఉందన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు వెంకటేశ్, కుసుమూరు వీఏఏ మధు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడిన ‘కారుణ్యం’



రోడ్డుపై ఉన్న మహిళను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎత్తుతున్న జేసీ రాజు

బొబ్బిలి పట్టణంలోని గాయత్రీకళాశాల రోడ్డులో గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. అటువైపుగా వస్తున్న కారుణ్య ఫౌండేషన్ సీఈఓ, రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు ఆమెను చూసి వెంటనే బైక్‌ను నిలిపారు. 108కు సమాచారం ఇచ్చారు. ఆలస్యమవుతుందన్న సమాచారం మేరకు ఆటోలో బొబ్బిలి ఆస్పత్రికి తరలించారు. అనంతరం సీఐ సతీష్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. బాధితురాలిది సీతానగరం మండలం చినభోగిలకు చెందిన రాపాక యశోదగా ఆధార్ కార్డును బట్టి గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు సేవలందించడంతో ఆమెకు స్పృహవచ్చాక కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. సకాలంలో స్పందించి మహిళను ఆస్పత్రికి చేర్చిన రాజును పలువురు అభినందించారు.

– బొబ్బిలి

### నైతిక విలువలతో కూడిన విద్య అవసరం




అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్ కుమార్

బొబ్బిలి: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా విద్యాబోధన చేయాలని బొబ్బిలి సీఐ సతీష్ కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి జూనియర్ కాలేజ్‌లో ప్రాతిపదిక విద్య–అక్షరాస్యత అన్న అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు, కాలేజ్ కరస్పాండెంట్ చింత అప్పారావు, ప్రిన్సిపాల్ వంశీ, కె.రామకృష్ణ,చినబాబు, చందు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వారాల పండగ



నీలమ్మతల్లికి ముర్రాట, పసుపు కుంకుమ సమర్పిస్తున్న మహిళలు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో మూడురోజుల పాటు నిర్వహించనున్న గ్రామదేవతల వారాల పండగ గురువారం ఘనంగా ప్రారంభమైంది.తొలిరోజు నీలమ్మతల్లికి గ్రామస్తులు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విజయనగరానికి చెందిన శిక్షణ ఫౌండేషన్ డీఎంటీ వల్లిదేవి సుమారు రూ.1.20 లక్షలతో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఈడిజిటల్ లైబ్రరీని ఎంపిడీఓ ఎస్.రామకృష్ణ,సర్పంచ్ కండి రమేష్ గురువారం ప్రారభించారు.గ్రంథాలయ అధికారి ఆర్. దుర్గాప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం పనుల్లో సిబ్బంది లక్ష్యాలను చేరుకోవాలని ఆ పథకం ఏపీడీ రమామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ సీహెచ్ సన్యాసిరావుతో కలిసి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో మండలం వెనుకబడి ఉందన్నారు. హార్టీకల్చర్, మినీ గోకులాలు, కంపోస్ట్ ఫిట్‌లు, పారం పాండ్ల నిర్మాణం, తదితర పనుల్లో లక్ష్యాలను చేరుకోవాలన్నారు.అక్టోబరు 2వ తేదీ నుంచి రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై ప్రణాళికలు తయారు చేస్తామని చెప్పారు. ఏపీఓ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

# మోసం, వంచన చంద్రబాబు నైజం

- ‘బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ’లో డాక్టర్ రాజేష్, కె.వి.సూర్యనారాయణరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్, వేదికపై సూర్యనారాయణరాజు

రాజాం సిటీ: నమ్మిన వారిని మోసం చేయడం, వంచించడం చంద్రబాబు నైజమని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజుఅన్నారు. మున్సిపాలిటీ పరిధి పానుగుటివలస గ్రామంలో గురువారం ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్, ఇతర వందల హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్ర బాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. నాడు బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు అదే బాదుడుతో ప్రజల నడ్డివిరుస్తున్నారని అన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నప్రభుత్వం ఒక్క సిలిండర్‌కే పరిమితమయ్యిందని, తల్లికి వందనం పథకం కొందరికే వర్తింపజేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ కూటమి మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయ కులపై ఉందని అన్నారు.

#### సీఎం కుర్చీ కోసమే లోకేష్ ఆరాటం

రాష్ట్ర ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా ఎప్పుడు సీఎం కుర్చీ దొరుకుతుందా అని మంత్రి నారా లోకేష్ ఆరాటపడుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక కొట్టుమిట్టాడుతున్న కళాశాలలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఏమైనా అంటే గత ప్రభుత్వం బకాయిలు వదిలేసిందని లోకేష్ అంటున్నారని, 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెట్టిన కోట్ల రూపాయిల బకాయిలను వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి విడుదల చేశారని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ విషయాన్ని గుర్తెరగాలని హితవుపలికారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం కళాశాలలు బంద్‌లకు వెళ్లే పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. రైతులకు యూరియా అందించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాల నాయుడు, నాయకులు రెడ్డి రమేష్, గార సత్యనారాయణ, శాసపు జగన్, మీసాల సూరి, శాసపు అప్పలనాయుడు, శాసపు దాము, పార్టీ పెన్షనర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పాలవలస శ్యామసుందర్, కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, కెంబూరు నారాయణరావు, మండల నాయకులు గోకవలస బాబూరావు, దూబ గోపాలం, వంజరాపు విజయ్‌కుమార్, పిట్టా జగదీష్, కోరాడ రామినాయుడు, గార త్రినాథరావు, రెడ్డి తిరుపతి, లావేటి ఆనందరావు, శాసపు నారాయణరావు, బాబూరావు, లక్ష్మునాయుడు, బోనెల రాము పాల్గొన్నారు.

## బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు



పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

రామభద్రపురం: మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ రాఘవులు అన్నారు. మండలంలోని కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును గురువారం ఆయన పరిశీలించారు. అలాగే వాహన తనిఖీలు చేశారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మానవుల మైండ్ సెట్ మారలేదని, మహిళలు,బాలికలు ప్రేమలో పడి తిరుగుతూ అవతలి వాడు ఏమిచేస్తున్నాడో గమనించడం లేదన్నారు.ప్రేమ పేరుతో ఫొటోలు, వీడియోలు తీసి తర్వాత లైంగిక వేధింపులకు గురిచేస్తున్నా సమాచారమి వ్వక, డ్యామేజ్ జరిగిన తర్వాత పోలీసులకు సమాచార మివ్వడం వల్లే ఎక్కువ అఘాయిత్యాలు జరుగుతున్నా యన్నారు. భయపడకుండా ముందుగానే జాగ్రత్త పడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగులు,మహిళలు,బాలికలపై దాడులు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించా మన్నారు. గంజాయి అక్రమరవాణా నియంత్రణకు ప్రత్యేక చెక్ పోస్టులతో పాటు టీమ్‌లు ఏర్పాటు చేశామ న్నారు. బ్లాక్ స్పాట్‌లు గుర్తించి రోడ్డు ప్రమాదాల జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదమే ప్రధాన కారణమన్నారు.మద్యం తాగి వాహనాలు నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు,కొత్త చట్టాలు,సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలు,గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట సీఐ కె.నారాయణరావు,ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.

### సమస్యలను పరిష్కరించండి

బొబ్బిలి: పట్టణంలోని ఆదర్శ రైల్వే స్టేషన్ పేరుకే ఆదర్శ రైల్వే స్టేషన్ అని సమస్యల్లో మాత్రం దీనినే ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. గురువారం ఇక్కడి మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పాత పార్ట్‌వే బ్రిడ్జ్‌ను మూడో లైన్ నిర్మాణంలో భాగంగా తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించినప్పటికీ మెట్లు ఎక్కేటప్పుడు వృద్ధులు, చిన్నారులు, వివిధ రోగాల బారిన పడిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, అంగవైకల్యం ఉన్నవారు ఈ బ్రిడ్జిని ఎక్కలేకపోతున్నారని,చాలా మంది ట్రాక్‌మీద నుంచే వెళ్తున్నారని ఎక్సలేటర్, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై శుక్రవారం ఉదయం 9 గంటలకు నిరసన వ్యక్తం చేసి స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందించనున్నట్టు చెప్పారు. పట్టణ వాసులు, ప్రయాణికులు వచ్చి సమస్యలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు యుగంధర్,నాగేంద్ర పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.15వేలు అమలు చేయాలి

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు, నైట్ వాచ్‌మెన్‌లకు కనీస వేతనం రూ.15వేలు అమలు చేయాలని మండల కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు సీహెచ్. రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శానిటేషన్ వర్కర్స్, నైట్ వాచ్‌మెన్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్స్, నైట్ వాచ్‌మెన్‌లు తొమ్మిదేళ్లుగా అతితక్కువ వేతనంతో కాలం వెళ్లదీస్తున్నారని, అది కూడా నెలవారీ సక్రమంగా అందడంలేదని అన్నారు. పెరుగుతున్న ధరల కు అనుగుణంగా నెలకు రూ.15వేల వేతనం అందించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు తక్షణమే అరికట్టాలని కోరారు. అలాగే ప్రతీ వంద మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించి పనిభారాన్ని తగ్గించాలని, నెలలో ఒకరోజు మెడికల్ లీవ్ మంజూరుచేయాలని, ఐడెంటిటీ కార్డులు, యూనిఫాం ఇవ్వాలని, టాయిలెట్స్ మెయింటెనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు పార్వతి, సునీత, రాంబాయి, అనూరాధ, లక్ష్మి, అరుణ, గౌరి, కుమారి, మాధవి, యశోద, సత్యవతి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం



రేగిడిలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు,తదితరులు

రేగిడి: మండల కేంద్రంతో పాటు, ఆమదాలవలస గ్రామాల్లో గురువారం నిర్వహించిన ‘స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం’లో భాగంగా గ్రీన్ అంబాసిడర్లను అధికారులు , ప్రజా ప్రతినిధులు సత్కరించారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయు డు, వావిలపల్లి జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీలు కాకుండా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని కోరారు. పంచాయతీల్లో నిధుల్లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఈఓపీఆర్డీ వి.జగన్నాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ సీహెచ్.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

### ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

బొబ్బిలిరూరల్: ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని హెచ్ఓ వెంకటరత్నం తెలిపారు.మండలంలోని సీహెచ్.బొడ్డవలసలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుందని, అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. ఈ పంటలో అంతర పంటలు సాగుచేసుకోవచ్చని,తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు వాటిని నాటిన నుంచి నాలుగేళ్ల పాటు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని చెప్పారు. ఆసక్తిగల రైతులు తమ వివరాలను ఉద్యానవన శాఖ సిబ్బందికి అందించాలని సూచించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న వసుధైక కుటుంబం ఫౌండేషన్ ప్రతినిధి ఈశ్వరరావు

రామభద్రపురం: బాలికా విద్యను ప్రోత్సహించడమే (వసుధైక కుటుంబం)యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని అయిదుగురు విద్యార్థినులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రేజీబీ సర్వీసెస్ వారు విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లోని పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు 750 సైకిళ్లు, రూ.1000 చొప్పున ఉపకార వేతనాలు అందజేసినట్లు తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలల కోసం ప్రశ్నించండి

బొబ్బిలి: బొబ్బిలికి స్టీల్ ప్లాంట్,ఎత్తిపోతల పథకాలు,వంతెనలు కావాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబీ నాయన అడుగుతున్న విషయం బాగానే ఉంది కానీ బొబ్బిలి పట్టణం, అసెంబ్లీ స్థానం పుట్టిన దగ్గర నుంచి ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం దారుణమని ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేటు కళాశాలలకు ఫీజులు చెల్లించలేకపోతున్నారని, ఈ ఇబ్బందులు తీరాలంటే ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాలలు ఉండాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అసెంబ్లీనే సరైన వేదికన్నారు. మళ్లీ అవకాశం వచ్చినప్పుడు ప్రభుత్వ కళాశాలల మంజూరు గురించి ప్రస్తావించాలని సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి మరో దగా రాజకీయం

- బాడంగి ఎంపీపీ పదవిపై అవిశ్వాసం పెట్టాలని ఆర్డీఓకు లేఖ
- ప్రలోభాలతో వైఎస్సార్‌సీపీ సభ్యులకు ఎర



అవిశ్వాస తీర్మానం పెట్టాలని బొబ్బిలి ఆర్డీఓకు లేఖ అందజేస్తున్న కూటమి నాయకులు

బొబ్బిలి: గడచిన మున్సిపల్ అవిశ్వాస ఎపిసోడ్‌తో ప్రజల్లో ఛీ కొట్టించుకున్న కూటమి నేతలు.. మరో దగా రాజకీయానికి తెరలేపారు. పది మందికి పైగా కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీకి ఉన్నప్పటికీ వారిని ప్రలోభాలతో మభ్యపెట్టి ఊళ్లు తిప్పి మరీ అవిశ్వాసంతో దొంగచాటున మున్సిపల్ చైర్మన్ పదవిని బలవంతంగా లాక్కుని అనుభవిస్తున్న కూటమి నాయకుల కళ్లు... ఈ సారి బాడంగి మండల పరిషత్ పీఠంపై పడ్డాయి. బాడంగి మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా గడిచిన ఎన్నికల్లో చెరోసగం సీట్లను వైఎస్సార్‌సీపీ, టీడీపీ గెలుచుకున్నాయి. అప్పటి ఎన్నికల అధికారులు లాటరీ నిర్వహించడంతో వైఎస్సార్ సీపీనే పదవి వరించింది. వైఎస్సార్‌సీపీ కోడూరు సభ్యురాలు భోగి గౌరి ఎంపీపీగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలుపొందిన మరిపి రమేష్‌ను టీడీపీ నాయకులు తమ వైపు తిప్పుకున్నారు. ఇప్పుడు ఎంపీపీ పదవిపై అవిశ్వాసానికి సమయం వచ్చిందని, మరో సభ్యుడు గుడెపువలస ఎంపీటీసీ పూడి సింహాచలం, అక్కడి మాజీ సర్పంచ్ పూడి ఆనందరావుతో కలిసి దగా రాజకీయం చేసి టీడీపీ కండువా వేశారు. సభ్యుల మొగ్గు మాకే ఉందని ఇప్పుడు అవిశ్వాసం నిర్వహించాలని బొబ్బిలి ఆర్డీఓకు జేవీఎస్ రామమోహనరావుకు బాడంగి టీడీపీ మండలాధ్యక్షుడు తెంటు రవిబాబు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, ఎంపీటీసీలు గురువారం లేఖ అందజేశారు. బొబ్బిలిలో రాజులు అధికారం చేపట్టాక దగా రాజకీయాలు, క్యాంపు రాజకీయాలు నడుస్తున్నాయని, రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.